## శాంతి భద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు

### వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి సీపీ విక్రమ్ సింగ్ మాన్



సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎలక్షన్ కోడ్ అమలుపై గురువారం నగర ఇన్‌చార్జి సీపీ (అదనపు సీపీ) విక్రమ్ సింగ్ మాన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన కేసులు నమోదు, శాంతి భద్రతల పర్యవేక్షణ, క్షేత్ర స్థాయిలో నేరాలను అదుపు చేయడానికి ముందస్తుగా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా క్షేత్ర స్థాయిలో నిఘాను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎలక్షన్ సెల్ ఇన్‌చార్జి, డీసీపీ రాధేశ్ మురళీ, లీగల్ అడ్వయిజర్ ఈ.రాములు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ఎన్నికల తనిఖీలు

### నారపల్లిలో రూ. 13.50 లక్షలు సీజ్

**ఎన్నికల నేపథ్యంలో ట్రై పోలీసు కమిషనరేట్ల పరిధిలో ముమ్మరంగా పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ తనిఖీల్లో ఏలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న బంగారం, వెండి, నగదును పోలీసులు పట్టుకుంటున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదాయపన్ను శాఖ అధికారులకు కూడా సమాచారమిస్తున్నారు. గురువారం వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన నగదు, బంగారం వివరాలు ఇలా ఉన్నాయి.**



పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.13.50లక్షలు

- **పీర్జాదిగూడ:** మేడిపల్లి పోలీసులు గురువారం సాయంత్రం నారపల్లి వెంకటాద్రి టౌన్‌షిప్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ. 13.50 లక్షలు పట్టుబడ్డాయి.
- **వెంగళరావునగర్:** ఎస్ఆర్‌నగర్ పోలీసులు సత్యం థియేటర్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ.9.90 లక్షలు పట్టుకున్నారు.
- **ఘట్‌కేసర్ రూరల్:** ఘట్‌కేసర్ పోలీసులు బైపాస్ రోడ్డు అండర్‌పాస్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.7.2 లక్షలు పట్టుబడ్డాయి.
- **మియాపూర్ :** మియాపూర్ పోలీసులు గోకుల్ చౌరస్తా సమీపంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో ద్విచక్ర వాహనదారుడి వద్ద 448.96 గ్రాముల బంగారు ఆభరణాలు లభించాయి.
- **అబిడ్స్:** అబిడ్స్ పోలీసులు పాత కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించిన తనిఖీల్లో మారుతి ఎస్ క్రాస్ వాహనంలో తరలిస్తున్న రూ. ఐదు లక్షల నగదును పట్టుకున్నారు.
- **మహేశ్వరం:** మహేశ్వరం పోలీసులు గురువారం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ. 5.43 లక్షలు పట్టుబడ్డాయి.

## చైతన్యపురి చౌరస్తాలో రూ. 33.50 లక్షల నగదు పట్టివేత




ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ నగదు

ఎల్బీనగర్, అక్టోబర్ 12: వాహనాల తనిఖీల్లో ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చైతన్యపురి చౌరస్తాలో ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో సుమారు రూ. 33.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## బాలానగర్‌లో రూ.11లక్షల 6 వేలు..



బాలానగర్, అక్టోబర్ 12: బాలానగర్ సీఐ కె. భాస్కర్ ఆధ్వర్యంలో పలు చోట్ల వాహనాలు తనిఖీలు చేపట్టగా.. రూ. 11 లక్షల 6 వేలు పట్టుబడ్డాయి. ఈ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## స్నానానికి వెళ్లి.. కౌకూర్ చెరువులో పడి ఇద్దరి మృతి

- భార్య కండ్లముందే భర్త మరణం...
- శోకసంద్రంలో కుటుంబసభ్యులు

జవహర్‌నగర్, అక్టోబర్ 12: కౌకూర్ బార్షపేట చెరువు నీటిలో మునిగి ఇద్దరు మృతిచెందారు. జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో సీతారాం కథనం ప్రకారం.. కౌకూర్ దర్గాలో బుధవారం ఉర్సు జరిగింది. దీనికి లంగర్‌హౌజ్‌కు చెందిన సలీం(30), ఫర్వీజ్(17) కుటుంబ సభ్యులు కూడా వచ్చారు. గురువారం ఉదయం స్నానం చేసేందుకు సలీం తన కుటుంబ సభ్యులతో కలిసి చెరువు వద్దకు వెళ్లాడు. సలీం, ఫర్వీజ్ చెరువులోకి దిగారు. లోతు తెలియక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. భార్య సుల్తానా చూస్తుండగానే సలీం చెరువులో మునిగిపోయాడు. కండ్ల ముందే భర్త మరణించడంతో సుల్తానాను ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఈ ఘటనను గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. ముగ్గురి మృతి

మేడ్చల్, అక్టోబర్ 12 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. ఈ ప్రమాదాలు మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ మండల రావల్‌కోల్ గ్రామానికి చెందిన బండారి హరికృష్ణ (24), భాను(18) కలిసి గురువారం తెల్లవారు జామున ద్విచక్ర వాహనంపై మేడ్చల్ చెక్‌పోస్టు నుంచి కిష్టాపూర్ వైపు వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన బొల్లేరో వ్యాన్ ఢీ కొట్టింది. హరికృష్ణ, భాను అక్కడికక్కడే మృతి చెందారు.

**మరో ప్రమాదంలో..**

మేడ్చల్ పట్టణ నివాసి మునీర్ ఖాన్ (55) గురువారం ఉదయం సైకిల్‌పై చెక్‌పోస్టు నుంచి కండ్లకోయ వైపు వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన లారీ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో మునీర్ ఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## స్కాలర్ షిప్ అర్హత పరీక్షకు దరఖాస్తులు

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 12: 2023–2024 విద్యా సంవత్సరానికి గాను 8వ తరగతి చదువుతున్న (ప్రభుత్వ, లోకల్ బాడీ, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల) విద్యార్థులు (ఎన్‌ఎంఎంఎస్‌ఎస్) స్కాలర్ షిప్ అర్హత పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు HTTP ://BSE. TELANGANA. GOV.IN ను సంప్రదించాలని సూచించారు.

## ఆర్మీ మేజర్ ఇంట్లో చోరీకి విఫలయత్నం

### దొంగతనానికి పాల్పడ్డ అంతర్రాష్ట్ర దొంగలు

అమీర్‌పేట్, అక్టోబర్ 12: అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఇద్దరు దొంగలు పట్టపగలు ఓ ఆర్మీ అధికారి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఇనుప రాడ్‌తో తలుపులను పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన ఆగంతకులు లాకర్లను కూడా ధ్వంసం చేశారు. దొంగల అలికిడితో పై అంతస్తులో ఉన్న కుటుంబ సభ్యులు అప్రమత్తమై వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఓ వృద్ధుడికి గాయాలు కాగా, కుటుంబ సభ్యులు ఒక దొంగని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన సనత్‌నగర్ పీఎస్ పరిధిలోని ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ 1049 క్వార్టర్స్‌లో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, లక్ష్మీనారాయణ, అతడి సోదరి ప్రేమ, ఆర్మీలో మేజర్‌గా పని చేస్తున్న కుమారుడు అభిషేక్ నివాసముంటున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రేమ, మొదటి అంతస్తులో సోదరుడు లక్ష్మీనారాయణ కుటుంబం నివాసముంటుండగా, ఈ నెల 9న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రేమ తన డోర్ లాక్ చేసి బయటకు వెళ్లింది. దీనిని గమనించిన ఇద్దరు ఆగంతకులు, తమ దగ్గరున్న రాడ్‌తో డోర్ పగులగొట్టారు. ఆ వెంటనే ఇంట్లోకి ప్రవేశించి సామాన్లు చెల్లాచెదురు చేశారు. ఇంతలో పై అంతస్తులో ఉన్న లక్ష్మీనారాయణకు అలికిడి శబ్దం రావడంతో కిందకు వచ్చి చూడగా, ఇద్దరు ఆగంతకులు తారసపడ్డారు. ప్రతిఘటించే ప్రయత్నం చేసిన లక్ష్మీనారాయణను ఇద్దరు దొంగలు బలంగా తోసేయడంతో ఆయన కింద పడిపోయాడు. ఇంతలో లక్ష్మీనారాయణ కుమారుడు అశోక్ వచ్చి దొంగలను పట్టుకున్నాడు. వీరిలో ఒకడు తన వద్ద ఉన్న రాడ్‌తో అశోక్‌పై దాడి చేస్తూ తప్పించుకున్నాడు. కాగా, పట్టుబడ్డ దొంగను సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు. సనత్‌నగర్ పోలీసులు దొంగతనానికి వచ్చింది ఢిల్లీకి చెందిన పాత నేరస్తులు సమీర్, శివగా తమ విచారణలో గుర్తించారు. పట్టుబడ్డ సమీర్‌ను రిమాండ్‌కు తరలించగా, పారిపోయిన శివ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# 143 సైబర్ కేసుల్లో 19మంది అరెస్టు

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో.. రంగంలోకి 14 ప్రత్యేక బృందాలు
- బ్యూరో డైరెక్టర్ స్టీఫెన్ రవీంద్ర

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో దూకుడు పెంచింది. దేశంలోనే తొలిసారిగా రూ.2.23 కోట్లు రికవరీ చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో.. సైబర్ నేరాలను ఛేదించడంలో గుజరాత్ తర్వాత రాష్ట్రం 2వ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ చివరి వారంలో నిర్వహించిన మెగా డ్రైవ్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట పోలీసు కమిషనరేట్ల నుంచి మొత్తం 14 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన 143 కేసులకు సంబంధించి గుజరాత్, రాజస్థాన్, జార్ఖండ్, ఢిల్లీ, వెస్ట్‌బెంగాల్, మహారాష్ట్ర, కేరళ, యూపీ తదితర మొత్తం 9 రాష్ట్రాలకు వెళ్లి దర్యాప్తు చేపట్టినట్టు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. ఈ కేసుల్లో మొత్తం 19 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 45 డెబిట్ కార్డులు, 9 పాస్ పుస్తకాలు, ల్యాప్‌టాప్, స్వైపింగ్ మెషిన్, 11 చెక్‌బుక్‌లు, 26మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



## గంజాయి పట్టివేత

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): గంజాయి తరలిస్తున్న నలుగురిని హైదరాబాద్ జిల్లా డీటీఎఫ్, నాంపల్లి ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. జిల్లా ఆబ్కారీ అధికారి సీహెచ్.విజయ్ కథనం ప్రకారం... గురువారం భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పెద్ద ఎత్తున గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు హైదరాబాద్ డీటీఫ్ ఇన్‌స్పెక్టర్ కంచర్ల కరుణారెడ్డి తన బృందంతో పాటు నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బందితో కలిసి రైలు బేగంపేట రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే రైలులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పుణె ప్రాంతానికి చెందిన హఫీజ్ నజీర్ షేక్, రంజన్ అదమ్ పాటిల్, చందులాల్ లక్ష్మణ్, అన్సారి గులాం వద్ద రూ.15.25లక్షల విలువజేసే 61కిలోల గంజాయి లభించింది. నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## రూ. 14.2 లక్షలు టోకరా

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ఫారెక్స్ ట్రేడింగ్‌లో పెట్టిన పెట్టుబడికి మూడు నెలల్లో డబుల్ అవుతుందంటూ నమ్మించి హిమాయత్‌నగర్‌కు చెందిన ఒక వ్యాపారికి సైబర్ నేరగాళ్లు రూ. 14.20 లక్షలు టోకరా వేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితుడికి టెలిగ్రామ్‌లో శ్వేత దేశాయ్ పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. ఫారెక్స్ ట్రేడింగ్ చేస్తే మంచి లాభాలొస్తాయని, పెట్టిన పెట్టుబడి మూడు నెలల్లో రెట్టింపు అవుతుందంటూ నమ్మించారు. ఇందులో భాగంగానే ఒక యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేయించారు. మొదట్లో పెట్టిన పెట్టుబడికి లాభం చూపించారు. ఆ తరువాత స్క్రీన్ పైనే లాభాలు కనిపిస్తుండగా.. వాటిని డ్రా చేసుకునే వీలు లేకుండా పోయింది. బాధితుడు పెట్టుబడి పెడుతూ వెళ్లాడు. స్క్రీన్ పైన రూ.61.31 లక్షల లాభం చూపిస్తుంది. అయితే, ఆ నగదును డ్రా చేసుకోవాలంటే పన్నులు చెల్లించాలంటూ నేరగాళ్లు సూచించారు. ఇదంతా మోసమని గుర్తించిన బాధితుడు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.